




WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY








జులై 12 బుధవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 188 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

WEDNESDAY AUGUST 12 2026 | VOL:18 | ISSUE: 188 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed


## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది: బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ

- మన్మోహన్ పై రాజకీయ దుష్ప్రచారాలకు తెరపడిందన్న సోనియా
- విచారణ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని స్వాగతించిన సోనియా
- సీబీఐ, ఈడీ వంటి సంస్థలను రాజకీయాలకు వాడుకుంటున్నారని మండిపాటు

బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో

(మిగతా 2వ పేజీలో..)



## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే: వి. హనుమంతరావు

- భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అన్న వీహెచ్
- భారతరత్న ఇవ్వడం ద్వారానే ఆయనకు నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్య
- పింగళి సేవలను మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అని ప్రశ్న

భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన



2

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

# భారీ పెట్టుబడులే లక్ష్యం

- సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- గతేడాది వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై నివేదిక కోరిన సీఎం
- వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక
- హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష
- రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం



తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో

(మిగతా 2వ పేజీలో..)

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ



(మిగతా 2వ పేజీలో..)

## చంద్రుడిపై శాశ్వత స్థావరం..

### భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

- మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని నాసా ఆహ్వానం
- చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద స్థావరం ఏర్పాటుకు ప్రణాళిక

చంద్రయాన్-3 విజయంతో భారత్‌కు




(మిగతా 2వ పేజీలో..)

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర
- కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది.కేంద్ర

(మిగతా 2వ పేజీలో..)



## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

### ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ



- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ

(మిగతా 2వ పేజీలో..)

## కొలంబియాలో భూకంప విలయం..

# 132కి చేరిన మరణాలు

- కొలంబియాను వణికించిన భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదైన తీవ్రత
- 132కి చేరిన మృతుల సంఖ్య.. వందల మందికి గాయాలు
- దేశంలో జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రభుత్వం

కొలంబియాలో నిన్న భారీ భూకంపం సంభవించి పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో సంభవించిన ఈ

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి)**

రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది: బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ

**మొదటి పేజీ తరువాయి)**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్ సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**మొదటి పేజీ తరువాయి)**

హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరపున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే: వి. హనుమంతరావు

**మొదటి పేజీ తరువాయి)**

మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'హర్ ఘర్ తిరంగా' పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు. దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతున్నప్పుడు, దానికి ప్రాణం పోసిన తెలుగు నేల ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య సేవలను ప్రధాని మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని ఘాటుగా ప్రశ్నించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ఇస్తేనే ప్రతి భారతీయుడికి, సమరయోధుల త్యాగాలకు సరైన గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. గతంలోనే తాను హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా కేంద్రం స్పందించి ఈ మహత్తర నిర్ణయం తీసుకోవాలని లేఖలో కోరారు.

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

# భారీ పెట్టుబడులే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి)**

సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

## ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ

**మొదటి పేజీ తరువాయి)**

పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు.ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు.ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

## కొలంబియాలో భూకంప విలయం.. 132కి చేరిన మరణాలు

**మొదటి పేజీ తరువాయి)**

శక్తిమంతమైన భూకంపం ధాటికి ఇప్పటివరకు 132 మంది మరణించగా, వందల మంది గాయపడ్డారు. ఈ శతాబ్దంలో దేశంలో ఇదే అత్యంత తీవ్రమైన భూకంపమని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.చోకో డిపార్ట్‌మెంట్‌లోని శాన్ జోస్ డెల్ పల్మార్ సమీపంలో సుమారు 100 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూప్రకంపనల ధాటికి పెరీరా, కాలీ, మణిజాలెస్ వంటి నగరాల్లో భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. మణిజాలెస్‌లోని ఓ చర్చి టవర్ కూలిపోతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రకంపనలు రాగానే ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

దేశవ్యాప్తంగా నేషనల్ ఎమర్జెన్సీ

ఈ విపత్తు నేపథ్యంలో దేశాధ్యక్షుడు అబెర్లార్డో డి లా ఎస్ప్రియెల్లా దేశవ్యాప్తంగా నేషనల్ ఎమర్జెన్సీని ప్రకటించారు. భూకంపం వల్ల 1,500కు పైగా ఇళ్లు దెబ్బతినగా, 61 భవనాలు పూర్తిగా నేలమట్టమయ్యాయని అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో ఆరు నెలల చిన్నారిని సురక్షితంగా కాపాడారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో కొలంబియా ఉండటమే భూకంప తీవ్రతకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

## చంద్రుడిపై శాశ్వత స్థావరం.. భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

**ప్రత్యేక గుర్తింపు**

**ఆర్టెమిస్ ఒప్పందం కింద సహకారం మరింత విస్తరణ**

**ఇస్రో గగన్‌యాన్, స్పేస్ విజన్ 2047కు కొత్త ఆశలు**

చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన 'మూన్ బేస్' కార్యక్రమంలో చేరాలని ఇస్రోను అమెరికా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్-అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ ఆహ్వానం అందింది.

**చంద్రుడిపై శాశ్వత స్థావరం**

చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు.చంద్రుడి దక్షిణ ధ్రువానికే నాసా ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడ శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో మంచు రూపంలో నీరు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆ నీటిని తాగడానికి, ఆక్సిజన్, రాకెట్ ఇంధనంగా మార్చుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో అంగారకుడిపై మానవ యాత్రలకు చంద్రుడిని కీలక కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నది నాసా లక్ష్యం.

**భారత్ అనుభవానికి గుర్తింపు**

చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 ఆగస్టులో చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ దిగాయి. ల్యాండింగ్ ప్రాంతానికి 'శివశక్తి పాయింట్'గా పేరు పెట్టారు. నాసా ఇప్పుడు అదే ప్రాంతంలో స్థావరం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇస్రో అనుభవం కీలకంగా మారనుంది. ఆర్టెమిస్ ఒప్పందంతో ముందుకు మూన్ బేస్ సహకారం ఆర్టెమిస్ అకార్డ్స్ కింద భారత్-అమెరికా భాగస్వామ్యానికి కొనసాగింపుగా ఉండనుంది. శాంతియుత, పారదర్శక, సుస్థిర అంతరిక్ష అన్వేషణకు ఈ ఒప్పందం మార్గదర్శకంగా ఉంటుంది. 2023 జూన్ 21న భారత్ ఆర్టెమిస్ అకార్డ్స్‌పై సంతకం చేసింది.బెంగళూరు సమావేశంలో అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. నిసార్ నుంచి చంద్రుడి వరకు భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. భారత్ గగన్‌యాన్ కార్యక్రమంతో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భవిష్యత్తులో చంద్రుడిపై మానవ కార్యకలాపాల వంటి లక్ష్యాలను 'స్పేస్ విజన్ 2047'లో భారత్ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో నాసా ఆహ్వానం ఇస్రోకు కీలక అవకాశంగా మారనుంది.

# తెలంగాణ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న వారసులు కళాకారులు

**TUWJ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ**

**హైదరాబాద్ ప్రతినిధి ఆగస్టు 11 విజయ కెరటం**



తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, తెలంగాణ అంటే ఒక జీవన సంస్కృతి... తెలంగాణ అంటే ఆట, పాటల పుట్ట... తెలంగాణ అంటే విభిన్న సంస్కృతుల, సంప్రదాయాల గడ్డ... తెలంగాణ అంటే పల్లె మట్టి పరిమళమని, ఆ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న గొప్ప వారసులు మన జానపద కళాకారులని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఖఔజీ) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. మంగళవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, గాజుల రామారంలోని పద్మావతి కన్వెన్షన్ లో, “కలాలు, గలాల వేదిక” నిర్వహించిన బోనాల కళా జాతరకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రముఖ ప్రజా గాయకుడు దరువు అంజన్న ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, పుస్తకాల్లో లేని చరిత్రను పాటల ద్వారా ప్రజలకు నేర్పి, వారిని చైతన్య పరిచేవాళ్ళే ప్రజా కళాకారులని, సామాన్యుల జీవితాలను, రైతుల కష్టాలను, కూలీల మహిళల భావాలను, పల్లె జీవనాన్ని తమ కళలో ప్రతిబింబించిన ఘనత కళాకారులకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు.



కళాకారుడి చేతిలోని డప్పు కేవలం ఒక వాయిద్యం మాత్రమే కాదని, అది ప్రజల గుండె చప్పుడని, అతని గొంతులో వినిపించే పాట కేవలం వినోదం మాత్రమే కాదని, అది సమాజానికి ఒక సందేశం, ఒక చైతన్యమని ఆయన పేర్కొన్నారు. అందుకే కళాకారుడిని కేవలం వినోదం అందించే వ్యక్తిగ కాకుండా, ఒక చరిత్రకారుడిగా, ఒక సామాజిక కార్యకర్తగా, ఒక చైతన్యవంతుడిగా, ప్రజల గొంతుక చూడాలని విరాహత్ అలీ అన్నారు. కళ బతికితే సంస్కృతి బతుకుతుందని, సంస్కృతి బతికితే సమాజం బతుకుతుందని, సమాజం బతికితే మన అస్తిత్వం బతుకుతుందని ఆయన స్పష్టం చేసారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జి. బాల్ రాజ్ గౌడ్ తో పాటు కళాకారులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నవతెలంగాణ రిపోర్టర్ ను పరామర్శించిన ఆరూరి రమేష్





**వరంగల్ ప్రతినిధి విజయ కెరటం ఆగస్టు 11 :**

వర్ధన్నపేట నియోజకవర్గ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ ఎన్టీఅర్ నగర్ గ్రామానికి చెందిన నవతెలంగాణ రిపోర్టర్ బావండ్లపెల్లి కిరణ్ తండ్రి వెంకటయ్య ఇటీవల మృతి చెందగా సోమవారం దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామానికి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ రైతు రుణ విమోచన కమిషన్ మాజి చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు వికలాంగుల కార్పొరేషన్ మాజి చైర్మన్ వాసుదేవ రెడ్డి,తదితర సీనియర్ నాయకులు చేరుకొని పరామర్శించారు.అనంతరం వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆ భగవంతుడు కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో 14వ డివిజన్ మాజీ అధ్యక్షుడు ముడుసు నరసింహ సీనియర్ కేతిరి రాజశేఖర్, గండ్రతి భాస్కర్, కొత్తపల్లి యాదగిరి, పత్రి సుభాష్ ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీ కోశాధికారి డాక్టర్ కర్రు రాజేందర్ ప్రతినిధులు ల్యాగల బిక్షపతి, నాయిని కృష్ణ గ్రేటర్ వరంగల్ 13వ డివిజన్ల ఫోరం మాజీ అధ్యక్షుడు నేరెళ్ల రాజు మల్లారెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ జక్కుల రమేష్ గౌడ్, గద్దల శ్రీను, కోట విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో రహదారులు తాగునీరు పారిశుద్ధం వీరు దీపాలు ఉంటే ప్రాథమిక వసతులు మరింత మెరుగుపరచాలి.






- **అభివృద్ధి పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలతో నిన్నుత సమయంలో పూర్తి చేయాలి.**
- **ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి.**
- **ఎమ్మెల్యే వేముల వీరేశం.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . ఆగస్టు 11 .విజయ కెరటం.**

నార్కెట్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి , సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేముల వీరేశం గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న మౌలిక వసతులు, సామర్థ్య వృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి ప్రాథమిక వసతులను మరింత మెరుగుపరచాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రతి గ్రామానికి చేరవేసి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు లు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ దళిత క్రిస్టియన్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం.

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . విజయ కెరటం.**



నల్లగొండ పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన సమావేశంలో యునైటెడ్ దళిత క్రిస్టియన్స్ ఫెడరేషన్.నూతన కార్యవర్గాన్ని ప్రకటించనైనది.గౌరవ సలహాదారు. ప్రొఫెసర్ వి. నతనియెలు .చీఫ్ అడ్వైసర్. తలకొప్పుల క్రిస్టాపర్ .యూ డి సి ఎఫ్ ప్రెసిడెంట్ డి ఎల్ సామ్సంను , వైయస్ ప్రెసిడెంట్ జేపీ సాల్మన్ రాజు, జనరల్ సెక్రటరీ పి. డేవిడ్ రాజు. ట్రెజరర్ ఆదిమల్ల ప్రభుదాసు , ఆర్గనైజింగ్ సెక్రటరీ డి ఎవినేజర్ .జాయింట్ సెక్రటరీ.దుబ్బాసి ప్రేమ్ కుమారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్1.బొంగరాల సమదానం2. మద్దెల చంద్ర పాలు.3. అజర్య నాయక్ .4. వేముల హానోకు ,5. లంకా ఎలీషా.6. దుబ్బ డేవిడ్ .అలహాదారులు.పి జేమ్స్ , పసల శౌరయ్య, జీవన్ ఫాదర్ ఎన్నికైనారు. వీరితో పాటు ప్రతి నియోజకవర్గానికి ఒక్కొకరిని ఎగ్జిక్యూటివ్స్ రెప్రజెంటేటివ్స్ మరియు 40 మంది (ఎంప్లాయీస్ ం రిటైర్డ్, సంగపెద్దలు) ల తో జంబో కమిటీ నీ కూడా ప్రకటించడం జరిగింది. ఇట్టి సమావేశంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి పాస్టర్లు సంఘ పెద్దలు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎట్టి సమావేశాన్ని విజయవంతం చేశారు. యు డి సి ఎఫ్ వేదిక ద్వారా కార్యవర్గ సభ్యులు పాస్టర్లు సంఘ పెద్దలు మరియు వక్తలు ముక్తకంఠంతో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మరియు దళిత క్రైస్తవుల మీద దేశవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ దాడులను అరికట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో జే డి పాల్, ప్రభాకర్ పాస్టర్, లవకుమార్ పాస్టర్, యేసు రత్నం, జాన్ రాజు, కత్తుల లాజరస్, చింత సైదులు పాలు, బెంజిమెను, జాషువా, యెహోవా దాసు , రామకృష్ణ, దేవదాసు, సుందర్, రామ్మోహన్, ప్రశాంత్, వెంకట్ రత్నం, సన్నీ, లాజర్, లింగయ్య, డేవిడ్ పాల్ , సంజీవయ్య, మేడి లక్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

- **ప్రతి మండలంలో 4 రోజులు ఉచిత వైద్య శిబిరాలు .**
- **నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . ఆగస్టు 11.విజయ కెరటం.**



నకిరేకల్, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు కంటి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడంతో పాటు, ఆపరేషన్ అనంతరం ఉచిత కంటి అద్దాలను కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలంలో 4 రోజుల పాటు ఇలాంటి ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గత ఏడాది సుమారు 1,000 మందికి కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన కంటి చూపును అందించడమే లక్ష్యంగా ఈ సేవలను మరింత విస్తరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలందరూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల-మాధవ్ రెడ్డి , పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు , పుష్పగిరి ఆసుపత్రి డాక్టర్ రాజేష్ వారి బృందం, మండల పార్టీ అధ్యక్షులు గాదగోని కొండయ్య , టౌన్ అధ్యక్షులు లింగాల వెంకన్న , ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి.

- **అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఆగస్టు 11 విజయ కెరటం.**




నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి , సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు తదితర ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందించేలా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డప్పు కొట్టే చెప్పులు కుట్టే మాదిగలకు నెలకు 5000 రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలి.

**టి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా, వినతి.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . ఆగస్టు 11. విజయ కెరటం**

తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు శిరసానోళ్ల బాలరాజు నాయకత్వంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా ఉమ్మడి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం వినతి పత్రం అందజేసిన టిఎంఆర్పిఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు ఉటుకూరి కృష్ణ మరియు సూర్యపేట జిల్లా అధ్యక్షులు కత్తి ఉపేందర్ మాదిగ. టి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి దళిత కుటుంబానికి అంబేద్కర్ అభయ హస్తం క్రింద 12 లక్షల రూపాయలు వెంటనే అమలు చేయాలని,మాదిగ దండోరా ఉద్యమకారులకు హైదరాబాదులో 250 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందజేయాలని, విద్య హక్కు చట్టం 2009 తెలంగాణ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఎస్సీలకు 15% నుంచి 20% వరకు రిజర్వేషన్ పెంచాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్సీలకు 25 శాతం పూర్తిస్థాయిలో ఉచిత విద్యను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్పిఎస్ నాయకులు చిందాల సంపత్ ,కళ్లెపురం అశోక్, పల్లె నాగయ్య వస్కుల కనకయ్య, బొజ్జ వెంకులు శ్రీనివాస్, పాతకోట్ల రమేష్, మామిడి సైదులు, గంగ బేరి శ్రీనివాస్, దంతాల వెంకటయ్య దుబ్బ రమేష్, కత్తి రవీందర్, పాల్వాయి వెంకటయ్య, దుబ్బా శ్యామ్, కంసాలపల్లి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

## మంచి కథలతో రండి.. అవకాశమిస్తాం: కొత్త దర్శకులకు అక్కినేని నాగార్జున బంపర్ ఆఫర్



మంచి కథలతో వచ్చే కొత్తవారికి అవకాశాలు ఇచ్చి సినిమాలు నిర్మించేందుకు తమ అన్నపూర్ణ స్టూడియోస్ సిద్ధంగా ఉందంటూ టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున అదిరిపోయే ప్రకటన చేశారు. 'పళ్ళ బురుసు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... మంచి కథ ఉన్నవారు ఎవరైనా సరే నేరుగా అన్నపూర్ణ స్టూడియోను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. స్టూడియో అంటే కేవలం లీజుకు ఇచ్చి డబ్బులు సంపాదించడం మాత్రమే కాదని, తిరిగి సినీ రంగానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే కొత్త దర్శకులతో చిత్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఇటీవల 'లెనిన్' సినిమాతో మంచి విజయాన్ని సాధించామని, ఇప్పుడు 'పళ్ళ బురుసు' నిర్మించి రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక'తో పాటు తన ప్రతిష్ఠాత్మక 100వ చిత్రం 'కింగ్ 100' కూడా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రాబోతున్నట్లు నాగార్జున వెల్లడించారు. కాగా, గోమతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా ప్రధాన పాత్రల్లో ఉదయ్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పళ్ళ బురుసు' చిత్రం అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఉదయనిధి వ్యాఖ్యల దుమారం.. త్రిష వరుస పోస్టులు వైరల్!





తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నటి త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై ఆమె నేరుగా స్పందించకపోయినా. . వరుస పోస్టులతో పరోక్షంగా ఆయనకు సమాధానం ఇచ్చారా అనే చర్చ మొదలైం ది.తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను త్రిష ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది. వాటితో పాటు కొన్ని సందేశాలను కూడా షేర్ చేసింది. "ఈ వయసులోనూ డ్రామాలు చేయడం ఏంటి? నీ పని నువ్వు చూసుకో.. డబ్బు సంపాదించుకో.. ప్రశాంతంగా ఉండు" అంటూ ఉన్న పోస్ట్‌ను పంచుకుంది. దానికి కనుబొమ్మ పైకెత్తిన ఎమోజీని జత చేసింది.మరో సందేశంలో "మీరు చేసే ప్రతి పనీ తిరిగి మీ దగ్గరకే వస్తుంది. మంచిగా ఉండండి.. మంచే చేయండి" అని ఉంది. "ఇకపై మీకు అన్నీ సవ్యంగా జరిగే అధ్యాయం మొదలైంది" అనే మరో సందేశాన్ని కూడా ఆమె పంచుకుంది. "రిస్క్ తీసుకునేవారే గెలుస్తారు" వంటి సందేశాలు కూడా ఉన్నాయి."ఒకప్పుడు కోరుకున్న జీవితంతో ఇప్పుడు ఉక్కిరిబిక్కిరవడం ఎంత గొప్ప అదృష్టం" అంటూ మరో పోస్ట్‌ను త్రిష షేర్ చేసింది. అయితే ఈ పోస్టులన్నీ ఉదయనిధిని ఉద్దేశించేనా? అన్న దానిపై ఆమె స్పష్టత ఇవ్వలేదు.ఇటీవల కావేరీ జలాల అంశంపై తంజావూరులో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఉదయనిధి ప్రసంగించారు. ఈ సందర్భంగా త్రిష పేరుతో నినాదాలు రావడంతో ఆయన చేసిన వ్యాఖ్య వివాదాస్పదమైంది. దీనిపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్రిష తాజా పోస్టులు చర్చనీయాంశంగా మారాయి.

## వివాదంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్.. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రముఖ గాయకుడు, బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. 'నాటు నాటు' పాటతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆయనపై విశాఖపట్నంలో కేసు నమోదైంది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.విశాఖకు చెందిన ఓ యువతి ఫిర్యాదు ప్రకారం.. కర్పూరపు రాహుల్ రెడ్డి అనే వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కూడా జోక్యం చేసుకున్నారని యువతి ఆరోపించారు. రాహుల్ రెడ్డికి బంధువునని చెప్పి, తనను బెదిరించారని, బలవంతంగా కొన్ని వీడియో స్టేట్‌మెంట్లు ఇప్పించారని ఆమె తన ఫిర్యాదులో వివరించారు.యువతి ఫిర్యాదుతో రాహుల్ సిప్లిగంజ్‌తో సహా మొత్తం 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో మధ్యవర్తిత్వం చేసిన కొందరు జర్నలిస్టులు, హైకోర్టు న్యాయవాది గీతా ప్రసన్న చందన కూడా ఉన్నట్లు సమాచారం. తొలుత ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, తదుపరి విచారణ నిమిత్తం దీనిని ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై రాహుల్ సిప్లిగంజ్ నుంచి గానీ, ఆయన ప్రతినిధుల నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



## ఆయనో నక్క.. నేను మాత్రం విశ్వాసమున్న కుక్కను: కంగనా ఘాటు వ్యాఖ్యలు!

బాలీవుడ్ నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్, ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ దేశంలో తింటూ, పొరుగు దేశం కోసం పోరాడతారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖుల మౌనం గురించి గతంలో నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం మరోసారి రాజుకుంది.ఇటీవల నటుడు పియూష్ మిశ్రా, నసీరుద్దీన్ షా వ్యాఖ్యలను ప్రస్తావించిన ఓ వార్తను కంగనా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్‌ను ఉద్దేశిస్తూ.. "నిజం చెప్పాలంటే ప్రతి ఒక్కరూ ఎవరో ఒకరికి కుక్కలే. కానీ, నేను ఏ ఇంటి (దేశం) రొట్టె తింటున్నానో, ఆ ఇంటికి కాపలా కాస్తున్నందుకు, దాని కోసం పోరాడుతున్నందుకు గర్వపడుతున్నాను. నసీర్ సాబ్ ఈ దేశపు తిండి తింటారు. కానీ, పొరుగు దేశం కోసం పోరాడతారు" అని కంగనా రాసుకొచ్చారు. ఆయన్ను ఓ 'నక్క' (లోమ్డీ) అని అభివర్ణించిన కంగనా, తాను మాత్రం విశ్వాసపాత్రమైన కుక్కగా ఉండటానికే ఇష్టపడతానని స్పష్టం చేశారు. గతంలో విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించినప్పుడు నసీరుద్దీన్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "నోట్లో ఎముక ఉన్న కుక్క మొరగదు. ఆ ఎముక కిందపడగానే లేదా పళ్లు విరగ్గొట్టగానే అప్పుడు మొరుగుతుంది" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పియూష్ మిశ్రా మాట్లాడుతూ, షా వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇప్పుడు ఏ 'కుక్కలు' మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. ఈ వార్తను షేర్ చేస్తూనే కంగనా నసీరుద్దీన్‌పై విరుచుకుపడ్డారు. గతంలో కూడా కంగనా విద్యార్థుల ఉద్యమాలను విమర్శిస్తూ, యువతలో ఒక వర్గాన్ని 'గట్టర్ చాప్' అని సంబోధించి వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే.

## వినాశకాలే విపరీత బుద్ధి: గోవిందాపై భార్య సునీత సంచలన వ్యాఖ్యలు

బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా, ఆయన భార్య సునీత అహుజా మధ్య విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. తన తాజా చిత్రం 'రూపా' ప్రమోషన్ల నిమిత్తం నూతన నటి కోమల్ రాణి స్వర్ణకర్‌తో కలిసి గోవిందా విమానాశ్రయంలో కనిపించడంపై సునీత తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "వినాశకాలే విపరీత బుద్ధి అన్న సామెత విన్నారా? ఆయన బుద్ధి గడ్డితిన్నది, అందుకే ఇలా ప్రవర్తిస్తున్నారు. దీనిపై నేనిక చెప్పేదేముంది?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.ఇటీవల ముంబై విమానాశ్రయంలో గోవిందా, కోమల్ రాణి కలిసి ఉన్న వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉందంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. దీనిపై మీడియా ప్రశ్నించగా సునీత పైవిధంగా స్పందించారు. సోషల్ మీడియాలో గోవిందాను 'చీటర్ నెం. 1' అని సంబోధించడంపై ఆమెను వివరణ కోరగా, 'ఈ ప్రశ్నను గోవిందా అభిమానులను అడగాలి. నేను ఏది మాట్లాడినా నన్ను ట్రోల్ చేస్తారు. ఇప్పుడు గోవిందా అభిమానులు, మీడియానే దీనికి సమాధానం చెప్పాలి. నన్ను ఏమీ అడగకండి, నాకిక మాట్లాడటం ఇష్టం లేదు" అని తేల్చి చెప్పారు.గోవిందా దంపతుల మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. గతంలోనూ గోవిందాకు ఇతరులతో సంబంధాలు ఉన్నాయంటూ సునీత పలుమార్లు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. అయితే, సునీత చేసే విమర్శలు కేవలం ప్రేమతో కూడినవని, తన కెరీర్ ఎదుగుదలలో, పిల్లల పెంపకంలో ఆమె పాత్ర వెలకట్టలేనిదని గోవిందా గతంలో పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం గోవిందా, కోమల్ రాణి 'రూపా' అనే చిత్రంలో జంటగా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగానే వీరిద్దరూ కలిసి కనిపిస్తున్నారనే వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.





Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528